పిఠాపురానికి భారీగా పోలీసు బలగాలు

‘తీర్పు’ నేడే



- జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేడే
- ఉదయం 8 గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్లు లెక్కింపు
- 8.30 గంటల నుంచి ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రారంభం
- పెద్దాపురం నియోజకవర్గం నుంచే తొలి పూర్తిస్థాయి ఎన్నికల ఫలితం
- ఆఖరి ఫలితం కాకినాడ రూరల్ నియోజకవర్గం నుంచే
- అత్యధికంగా కాకినాడ రూరల్‌లో 19 రౌండ్లు, పెద్దాపురం 15 రౌండ్లలో కౌంటింగ్
- ఒక్కో నియోజకవర్గం ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్ల చొప్పున ఏర్పాట్లు
- మధ్యాహ్నం 12 గంటలకు నియోజకవర్గాల వారీగా ఫలితాలపై స్పష్టత
- అటు జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఫలితాలు ఏకపక్షమే: అధికార వైసీపీలో వణుకు
- మొత్తం 18,470 పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు 32 టేబుళ్లు
- తుని, కాకినాడ రూరల్, కాకినాడ సిటీ.. వీటి ఫలితాలు రెండు రౌండ్లలోనే
- మొత్తం బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు రెండు నుంచి నాలుగు గంటల వ్యవధి
- ఫలితాల నేపథ్యంలో విజయం తమదేనని కూటమి అభ్యర్థుల్లో ధీమా
- ఓటమి భయంతో బెంబేలెత్తుతున్న వైసీపీ అభ్యర్థులు
- అల్లర్లు, ఘర్షణలు జరగకుండా నియోజకవర్గాల్లో భారీగా బలగాల మోహరింపు

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

“ఎప్పుడెప్పుడా అని ఊపిరిబిగబట్టి ప్రతి ఒక్కరూ ఎదురుచూస్తున్న అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తీర్పు మరికొన్ని గంటల్లో వెలువడనుంది. అభ్యర్థుల తలరాతలు తేల్చే ఓట్ల లెక్కింపు ప్రక్రియ జిల్లాలో మరికాసేపట్లో మొదలుకానుంది. కాకినాడ జిల్లా పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంట్ స్థానానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు కాకినాడ జేఎన్టీయూలో ఈరోజు ఉదయం 8 గంటల నుంచి ప్రారంభంకానుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపును అధికారులు మొదలుపెట్టనున్నారు. ఆ తర్వాత 8.30 గంటలకు ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఒక్కో రౌండ్ ఫలితం వెల్లడికి దాదాపు 45 నిమిషాల వరకు పట్టనుంది. మధ్యాహ్నం 12 గంటలకు అభ్యర్థుల విజయానికి సంబంధించి దాదాపు స్పష్టత రానుంది. పూర్తిస్థాయి ఫలితాలు మధ్యాహ్నం 3కి వెల్లడికానున్నాయి. కాగా జిల్లాలో తొలి అసెంబ్లీ ఎన్నికల ఫలితం పెద్దాపురం నియోజకవర్గంలో వెల్లడికానుంది. ఆఖరి ఫలితం కాకినాడ రూరల్‌లో తేలనుంది. అన్నింటికంటే పెద్దాపురం నియోజకవర్గం ఓట్ల లెక్కింపు రౌండ్లు తక్కువ కావడంతో తొలి ఫలితం ఇక్కడి నుంచే రానుంది. మరోపక్క పోస్టల్ బ్యాలెట్ ఫలితా ఉదయం పదికే దాదాపు తేలిపోనున్నాయి. కాగా పోస్టల్ బ్యాలెట్ ఫలితాలు కూటమికి ఏకపక్షంగా ఉంటాయనే సంకేతాలతో అధికార వైసీపీ వణికిపోతోంది. వీటిని బట్టి ఈవీఎం ఓట్ల ట్రెండ్ కూడా తేలిపోయి ఓటమి తప్పదనే భయం ఆ పార్టీ అభ్యర్థులను తీవ్రంగా కలవరపెడుతోంది. అటు కూటమిదే పీఠం అని ఇప్పటికే ఎగ్జిట్‌పోల్స్ వెల్లడించిన నేపథ్యంలో టీడీపీ, జనసేన అభ్యర్థులు తమ గెలుపుపై ధీమాగా ఉన్నారు.”





చిత్రాలు..

ఓట్ల లెక్కింపు జరిగే జేఎన్టీయూ వద్ద బందోబస్తు.. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి సోమవారం కలెక్టరేట్ ఎన్ఐసీ సెంటర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్... బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు సిద్ధమైన ఏర్పాట్లు



పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఇలా..

అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు జిల్లాలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుతో కౌంటింగ్ మొదలుకానుంది. కాకినాడ జేఎన్టీయూలో జరగనున్న ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఏడు నియోజకవర్గాలకు సంబంధించి వేర్వేరు గదుల్లో లెక్కింపు ప్రక్రియ జరుగుతుంది. ఒక్కో నియోజకవర్గానికి సంబంధించి ఈసీ ప్రత్యేకంగా కౌంటింగ్ అబ్జర్వర్లను నియమించింది. అలాగే అలాగే ఆర్వో తదితరులు ఓట్ల లెక్కింపును పర్యవేక్షిస్తారు. మరోపక్క ఓట్ల లెక్కింపునకు సంబంధించి సిబ్బంది ర్యాండమైజేషన్‌ను కలెక్టర్ పూర్తిచేశారు. మరోపక్క పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. ఈనేపథ్యంలో ఉదయం ఆరు గంటలకే కౌంటింగ్ సిబ్బంది తమకు కేటాయించిన నియోజకవర్గ లెక్కింపు కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో మొత్తం 18,470 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కు బ్యాలెట్ రూపంలో వినియోగించుకున్నారు. తొలుత వీటిని నియోజకవర్గాల వారీగా లెక్కించడం మొదలు పెడతారు. ఇందుకోసం ఏడు నియోజకవర్గాలకు కలిపి మొత్తం 32 టేబుళ్లు ఏర్పాటుచేస్తున్నారు. తుని నియోజకవర్గంలో మొత్తం 2,206 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు దాఖలయ్యాయి. వీటి లెక్కింపునకు నాలుగు టేబుళ్లు సిద్ధం చేశారు. రెండు రౌండ్లలో వీటి ఫలితాలు వెల్లడవనున్నాయి. ఇందుకు నాలుగు గంటల సమయం పట్టనుంది. నియోజకవర్గంలో దాఖలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను కౌంటింగ్ సిబ్బంది బాక్సుల్లో వేస్తారు. ఆనక వీటిని యాభై ఓట్ల చొప్పున కట్టలు కడతారు. అనంతరం ఆయా అభ్యర్థులకు దాఖలైన వాటిని లెక్కిస్తారు. ఈ క్రమంలో బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు కాస్త ఎక్కువ సమయం పట్టనుంది. మరోపక్క ప్రత్తిపాడు నియోజకవర్గంలో 1,760 పోస్టల్ బ్యాలెట్ ఓట్లుపడగా, వీటి లెక్కింపునకు నాలుగు టేబుళ్లు సిద్ధం చేశారు. ఒక రౌండ్‌లోనే ఫలితాలు రానున్నాయి. ఇందుకు రెండు గంటల వ్యవధి పట్టనుంది. పిఠాపురంలో 2,493 ఓట్లు దాఖలవగా, అయిదు టేబుళ్లు వేశారు. ఒక రౌండ్‌లో కౌంటింగ్ పూర్తికానుంది. కాకినాడ రూరల్‌లో అత్యధికంగా 4,854 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. అయిదు టేబుళ్లపై రెండు రౌండ్లలో ఈ ఓట్లు లెక్కించనున్నారు. పెద్దాపురంలో 2,077 ఓట్లకు ఒక రౌండ్, కాకినాడ సిటీలో 3,418 ఓట్లకు రెండు రౌండ్లు, జగ్గంపేట 1,662 ఓట్లకు ఒక రౌండ్‌లో కౌంటింగ్ జరగనుంది. కాకినాడ పార్లమెంట్ పరిధిలో పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లను సిద్ధం చేస్తుండగా, మూడు రౌండ్లలో ఫలితాలు వెల్లడించనున్నారు. ఇందుకు మొత్తం ఆరు గంటల వ్యవధి పట్టనుంది. ఈ ప్రక్రియ ముగియడానికి ఒక్కో నియోజకవర్గానికి రెండు నుంచి నాలుగు గంటల వ్యవధి పట్టనుంది. అయితే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు తీవ్ర ఉత్కంఠ రేకెత్తించనుంది. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులంతా ఈ హక్కు వినియోగించుకున్న నేపథ్యంలో వారంతా అధికార వైసీపీపై ఆగ్రహంతో కూటమికే భారీగా ఓట్లు వేశారన్న అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఫలితాలు ఏకపక్షంగా ఉంటాయన్న చర్చ సర్వత్రా జరుగుతోంది. ఒకరకంగా చెప్పాలంటే వీటి ఫలితాలను బట్టి ఈవీఎం ఓట్ల లెక్కింపు ఫలితాల ట్రెండ్ కూడా తెలిసిపోనుంది. ఏ పార్టీ విజయకేతనం ఎగురవేయబోతుందనేది ఈ ఓట్లే దాదాపు స్పష్టంచేయనున్నాయి. ఈ నేపథ్యంలో తొలిగా వెల్లడికానున్న పోస్టల్ బ్యాలెట్ ఫలితాలపై రాజకీయ పార్టీలు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాయి.

8.30 నుంచే ఈవీఎం ఓట్ల లెక్కింపు..

మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి కాకినాడ పార్లమెంట్‌తోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రారంభంకానుంది. ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గానికి వేర్వేరు గదుల్లో 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటుచేశారు. పెద్దాపురం నియోజకవర్గంలో 201 పోలింగ్ బూత్‌ల పరిధిలో 1,76,993 ఓట్లు పోలవగా ఒక్కో రౌండ్‌కు 14టేబుళ్ల చొప్పున మొత్తం అన్ని బూత్‌ల్లోని ఓట్లను 15రౌండ్లలో కౌంటింగ్ పూర్తి చేయనున్నారు. తద్వారా తక్కువ రౌండ్లు ఉండడంతో తొలిగా పెద్దాపురం నియోజక వర్గ పూర్తిస్థాయి అసెంబ్లీ ఫలితాలు వెల్లడవనున్నాయి. ఈ నియోజకవర్గంలో ఈవీఎం ఓట్ల లెక్కింపునకు మూడు గంటల సమయం పట్టనుంది. ఆతర్వాత ఫలితం తుని నియోజకవర్గం నుంచి వెల్లడి కానుంది. ఇక్కడ 224 బూత్‌ల్లో 1,87,215 ఓట్లు పోలయ్యాయి. వీటిని రౌండ్‌కు 14 టేబుళ్ల చొప్పున 16 రౌండ్లలో కౌటింగ్ చేపట్టనున్నారు. ప్రత్తిపాడు, కాకినాడ సిటీ నియోజకవర్గాల ఫలితాలు ఏకకాలంలో వెలువడనున్నాయి. కాకినాడసిటీలో 234 బూత్‌ల పరిధిలో 1,74,366 ఓట్లు పోలయ్యాయి. వీటిని 14టేబుళ్ల చొప్పున 17 రౌండ్లలో కౌంటింగ్ చేస్తారు. ఇందుకు 4.16 గంటల వ్యవధి పట్టనుంది. ప్రత్తిపాడు నియోజకవర్గంలో 227 బూత్‌ల్లో 1,74,788 ఓట్లు పోలవగా, 17 రౌండ్లలో కౌంటింగ్ చేపడతారు. పిఠాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లో 18 రౌండ్లలో ఫలితాలు వెల్లడవనున్నాయి. పిఠాపురంలో మొత్తం 242 పోలింగ్ బూత్‌ల్లో 2,04,811 ఓట్లు పోలవగా వీటిని రౌండ్‌కు 14 టేబుళ్ల చొప్పున మొత్తం 18 రౌండ్లలో కౌంటింగ్ చేస్తారు. ఇందుకు 3.10గంటల వ్యవధి పట్టనున్నట్లు అంచనా. జగ్గంపేటలో 248బూత్‌ల్లో 1,92,287ఓట్లు పోలవగా 18రౌండ్లలో ఫలితాలు వెల్లడవనున్నాయి. అత్యధికంగా కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 264 బూత్‌ల పరిధిలో 2,01,833 ఓట్లు పోలయ్యాయి. వీటిని లెక్కించడానికి 19 రౌండ్లు పట్టనున్నాయి. అయితే ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తర్వాత దాదాపు సగం రౌండ్లకే విజేత ఎవరనేదానిపై స్పష్టత రానుంది. మరోపక్క కౌంటింగ్ ప్రక్రియలో ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక్కో ఎన్నికల అబ్జర్వర్ ఉంటారు. ఒక ఏఆర్వో, 18 మంది సూపర్‌వైజర్లు, 18 మంది సహాయకులు, 18 మంది మైక్రో అబ్జర్వర్లు ఉంటారు. వీరితోపాటు వివిధ పార్టీల ఎన్నికల ఏజెంట్లు కూడా ఉంటారు.

విజయం ఎవరి వైపు..

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో టీడీపీ విజయబావుటా ఖాయమైపోయిందని ఆ పార్టీ అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అధికార వైసీపీ అక్రమాలు, అరాచకాలతో విసుగెత్తిపోయిన జనం పోలింగ్ రోజు ఓటుతో చాచికొట్టారని విశ్లేషిస్తున్నారు. అందుకే భారీ పోలింగ్ జరిగిందని వివరిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఎగ్జిట్‌పోల్స్‌లో సైతం టీడీపీ కూటమిదే విజయమని తేల్చి చెప్పడంతో మెజార్టీలు ఎంతనేది తేలాల్సి ఉందని చెబుతున్నారు. మరోపక్క అధికార వైసీపీకి ఓటమి ఖాయమని సర్వేలు తేల్చి చెప్పడంతో ఆ పార్టీ అభ్యర్థులు నిర్వేదంతో ఉన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, ఈవీఎం ఓట్లు వేటిలోను తమకు ఆధిక్యత రావడం కష్టమేనన్న అభిప్రాయం వారిలో వ్యక్తమవుతోంది. ఒకరకంగా చెప్పాలంటే ఫలితాల్లో జిల్లాలో ఒక్క సీటు అయినా వస్తుందా? అనే చర్చ వైసీపీ అభ్యర్థుల్లో నెలకొంది. మరోపక్క ఫలితాల నేపథ్యంలో అల్లర్లు, ఘర్షణలు జరగకుండా కౌంటింగ్ కేంద్రం ఎదుట భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. నియోజకవర్గాల్లోను ప్రత్యేక బలగాలను మోహరించారు. కౌంటింగ్ కేంద్రాల లోపల సైతం అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

నేడు రంగరాయ మెడికల్ కాలేజీకి సెలవు

కలెక్టరేట్(కాకినాడ), జూన్3: జేఎన్‌టీయూకేలో ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు సెలవును ప్రకటించినట్లు కలెక్టర్ జె.నివాస్ తెలిపారు.

ముగిసిన ఓట్ల లెక్కింపు ర్యాండమైజేషన్

కలెక్టరేట్(కాకినాడ),జూన్3: సార్వత్రిక ఎన్నికలు 2024లో భాగంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన సిబ్బంది రెండో దశ ర్యాండమైజేషన్ సోమవారం కలెక్టరేట్ ఎన్ఐసీ సెంటర్‌లో ముగిసింది. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అబ్జర్వర్ల సమక్షంలో కలెక్టర్ నివాస్, జేసీ రామ్‌సుందర్‌రెడ్డి సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు లెక్కింపులో పాల్గొనే సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లుల కోసం ర్యాండమైజేషన్ చేశామన్నారు. మంగళవారం కాకినాడ పార్లమెంట్‌తోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సిబ్బందిని కేటాయించామన్నారు. ఓట్ల లెక్కింపులో 941 మంది సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి కాకినాడ జేఎన్‌టీయూలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ భావన, డీఆర్వో తిప్పేనాయక్, సీపీవో త్రినాథ్, జిల్లా ఉపాధి శిక్షణాధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏడు నియోజకవర్గాల కౌంటింగ్ అబ్జర్వర్లు వీరే

జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ అబ్జర్వర్లను నియమించారు. తుని నియోజకవర్గం గౌరవకుమార్, ప్రత్తిపాడు నియోజకవర్గం రాజేశ్ జోగ్‌పాల్, పిఠాపురం డాక్టర్ మేజర్ విశాల్ శర్మ, కాకినాడ రూరల్ నిధి సరోహి, పెద్దాపురం నియోజకవర్గం ఆల్బర్ట్ బిలాంగ్, కాకినాడ సిటీ నియోజకవర్గం ఎస్.గణేశ్, జగ్గంపేట నియోజకవర్గం డాక్టర్ కె. దాక్షాయణిలు అబ్జర్వర్లుగా వ్యవహరిస్తారు.

స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించిన ఎన్నికల అధికారులు

కాకినాడ జేఎన్‌టీయూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఉన్న పిఠాపురం అసెంబ్లీ కౌంటింగ్ కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్, ఆర్వో రామ్‌సుందర్‌రెడ్డి, పిఠాపురం కౌంటింగ్ అబ్జర్వర్ డాక్టర్ మేజర్ విశాల్‌శర్మలు పరిశీలించారు. ఈవీఎం స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ రామ్‌సుందర్ రెడ్డి మాట్లాడుతూ సిబ్బంది మంగళవారం ఉదయం ఆరు గంటలకు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా సిబ్బంది కృషిచేయాలన్నారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు.

మీడియా సమాచార కేంద్రంలో సర్వంసిద్ధం

ఓట్ల లెక్కింపునకు సంబంధించి జేఎన్‌టీయూ కంప్యూటర్ సైన్స్ పీజీ బ్లాక్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమాచార కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ జె.నివాస్ ఎన్నికల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సంబంధించి జేఎన్‌టీయూ కంప్యూటర్ సైన్స్ పీజీ బ్లాక్‌లో మీడియా సమాచార కేంద్రాన్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. మీడియా ప్రతినిధులకు అవసరమైన హైస్పీడ్ నెట్, టీవీలు, భోజనం, తాగునీరు ఇతర సదుపాయాలు ఏర్పాటుచేశామన్నారు. అలాగే మీడియా ప్రతినిధులు కౌంటింగ్ ప్రక్రియ విజువల్స్ తీసుకునేందుకు ఆయా నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. రౌండ్ల వారీగా ఎన్నికల ఫలితాలు మీడియా సమాచారం కేంద్రం ద్వారా విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఏడీసీ నాగ నరసింహరావు, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాసు, సమాచార శాఖ డీడీ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



జేఎన్‌టీయూలో మీడియా సమాచార కేంద్రాన్ని పరిశీలించిన నివాస్

కౌంటింగ్ నేపథ్యంలో దారి మళ్లింపు



జేఎన్‌టీయూ వైపు వెళ్లే రాకపోకలు నిషేధించడంతో ఏర్పాటుచేసిన బారికేడ్లు


కాకినాడ క్రైం, జూన్3: కాకినాడ జిల్లా పార్లమెంట్, 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం కాకినాడ జేఎన్‌టీయూ క్యాంపస్, జేఎన్‌టీయూ స్టేడియం ప్రాంగణాల్లో జరగనున్న నేపథ్యంలో కాకినాడకు రాకపోకలు సాగించే వాహనాల ట్రాఫిక్ మళ్లింపునకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ సోమవారం రాత్రి విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. ఈ దారి మళ్లింపు ప్రక్రియ మంగళవారం తెల్లవారు జామున 4 గంటల నుంచి కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు కొనసాగుతుందన్నారు. పిఠాపురం నుంచి కాకినాడ, అమలాపురం, రామచంద్రపురం, పెద్దపూడి వెళ్లవలిసిన వాహనాలు పిఠాపురం, చిత్రాడ నుంచి తిమ్మాపురం వై జంక్షన్ వద్ద కుడి వైపునకు తీసుకుని కొత్తగా వేసిన బైపాస్ మార్గం ద్వారా ఏడీబీ రోడ్డులోకి ప్రవేశించి కొప్పవరం జంక్షన్ నుంచి కుడివైపునకు తీసుకుని ఉండూరు బ్రిడ్జి మీదుగా సామర్లకోట వెళ్లేవారు కుడివైపునకు, ఇంద్రపాలెం వెళ్లేవారు ఎడమవైపునకు వెళ్లాలన్నారు. అలాగే కాకినాడ పట్టణంలోకి వెళ్లాల్సిన వారు ఉండూరు బ్రిడ్జి వద్ద ఎడమవైపునకు తీసుకుని కెనాల్‌రోడ్డు మీదుగా మాధవపట్నం, ప్రతాప్‌నగర్ బ్రిడ్జి, ఇంద్రపాలెం బ్రిడ్జి వద్ద ఎడమవైపునకు తీసుకుని వారి గమ్యాలకు చేరాలన్నారు. అలాగే పెదపూడి, రామచంద్రపురం. యానాం, అమలాపురం వెళ్లవలిసిన వాహనదారులు పై మార్గంలో వచ్చి ఇంద్రపాలెం బ్రిడ్జి నుండి కుడివైపునకు తీసుకుని చీడిగ కొత్త బైపాస్ మీదుగా పెదపూడి వైపు వెళ్లాలన్నారు. అలాగే రామచంద్రపురం వైపు వెళ్లాల్సిన వాహనదారులు పైమార్గం ద్వారా వచ్చి చీడిగ కొత్తగా నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద ఎడమవైపునకు తీసుకుని బైపాస్ మీదుగా ఎన్‌హెచ్-216 తూరంగి బ్రిడ్జి వద్ద కుడివైపునకు తీసుకుని రామచంద్రపురం వైపునకు ప్రయాణించవచ్చన్నారు. అలాగే తాళ్లరేవు, యానాం, అమలాపురం వెళ్లాల్సిన వాహనదారులు పైమార్గం ద్వారా వచ్చి తూరంగి బ్రిడ్జి నుండి నేరుగా ఉప్పలంక వై జంక్షన్ మీదుగా యానాం వైపు వెళ్లవచ్చన్నారు. అదేవిధంగా కాకినాడ, సామర్లకోట, పిఠాపురం, తుని, విశాఖపట్నం వైపు వెళ్లాల్సిన వాహనదారులు అమలాపురం, యానాం మీదుగా వచ్చే వాహనదారులు ఉప్పలంక వై జంక్షన్ వద్ద నుంచి ఎడమవైపునకు తీసుకుని తూరంగి బ్రిడ్జి మీదుగా చీడిగ బ్రిడ్జి వద్దకు చేరుకుని కుడివైపునకు తీసుకుని ఇంద్రపాలెం బ్రిడ్జి మీదుగా ఎడమవైపునకు తీసుకుని కెనాల్ రోడ్డులో సామర్లకోట వైపు వెళ్లవచ్చన్నారు. ఆదేవిధంగా ఇంద్రపాలెం బ్రిడ్జి వద్ద నుంచి కుడివైపునకు తీసుకుని కాకినాడ నగరంలోకి ప్రవేశించవచ్చన్నారు. అలాగే పిఠాపురం వెళ్లాల్సిన వాహనదారులు సామర్లకోట మీదుగా లేదా కెనాల్ రోడ్డులోని ఉండూరు బ్రిడ్జి వద్దకు చేరుకుని అక్కడ నుంచి కుడివైపునకు తీసుకుని ఏడీబీ రోడ్డులో గల కొప్పవరం జంక్షన్ వద్ద కొత్తగా నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద ఎడమవైపునకు తీసుకుని తిమ్మాపురం వైజంక్షన్ నుంచి పిఠాపురం వెళ్లవచ్చన్నారు. ఇక కాకినాడ నుంచి సామర్లకోట, పిఠాపురం వెళ్లాల్సిన వాహనదారులు భానుగుడి జంక్షన్ నుంచి ముత్తా గోపాలకృష్ణ వారధి మీదుగా శారదాదేవిగుడి, కర్ణంగారి జంక్షన్ నుంచి కుడివైపునకు తీసుకుని గైగోలుపాడు జంక్షన్, సర్పవరం పూల మార్కెట్ మీదుగా మాధవపట్నం సెంటర్, కెనాల్ రోడ్డు మీదుగా సామర్లకోట వైపు, పిఠాపురం వైపు వెళ్లవచ్చన్నారు. ఇటు కాకినాడ పోర్ట్ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే భారీ వాహనాలను కాకినాడ నగరంలోకి ప్రవేశించకుండా రాజానగరం నుంచి సామర్లకోట వరకు గల ఏడీబీ రోడ్డులో కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు నిలుపుదల చేయాలని ఎస్పీ చెప్పారు. కత్తిపూడి బ్రిడ్జి నుంచి కాకినాడ పోర్ట్‌కు వచ్చే భారీ వాహనాలు కత్తిపూడి జంక్షన్ వద్ద నిలుపుదల చేయాలని, కాకినాడ లైట్‌హౌస్ వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు లైట్‌హౌస్ సూర్యపేట జంక్షన్ వద్ద, అటు ఉప్పలంక వై జంక్షన్ వద్ద నిలుపుదలచేయాలని కోరారు.

ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఏర్పాట్లన్నీ పూర్తిచేశాం : కలెక్టర్ నివాస్

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 3 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కాకినాడ జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూలో నియోజకవర్గాల కౌంటింగ్ సూపర్వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్స్, మైక్రో అబ్జర్వర్ల తుది దశ శిక్షణ కార్యక్రమాలను ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిమిత్తం చేపట్టిన ఏర్పాట్లను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. అలాగే 8.30 గంటల నుంచి ఈవీఎంల ఓట్ల లెక్కింపు మొదలవుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా సిబ్బందికి కేటాయించిన కౌంటింగ్ టేబుల్స్ వద్దనే నమూనా ఓట్ల లెక్కింపు ప్రక్రియపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కి సంబంధించి జిల్లాలో సుమారుగా 18వేల పైన ఓట్లు నమోదయ్యాన్నారు. పార్లమెంటు సంబంధించి మొదటి రౌండ్ ఫలితాలు ఉదయం 9.30 గంటలకు వెలువడే అవకాశం ఉందన్నారు. ఏజెంట్లు ఐడీ కార్డుతోపాటు ఆర్వో ఇచ్చిన డిక్లరేషన్ ఫారం తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. మంగళవారం ఉదయం 6.30 గంటలలోపే ఏజెంట్లు, అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఏడు గంటల తర్వాత గేటు మూసివేయడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల వాహనాల పార్కింగ్ సంబంధించి జేఎన్‌టీయూ ఎదురుగా ఉన్న ఐటీఐ గ్రౌండ్‌లోనూ, పెద్దాపురం నియోజకవర్గానికి సంబంధించి జేఎన్‌టీయూ ఆడిటోరియం పక్కన ఉన్న జిల్లా క్రీడా మైదానం కేటాయించడం జరిగిందన్నారు. ఏజెంట్లు ఎవరైనా మద్యం సేవించినట్టు నిర్ధారణ అయితే బ్రీతింగ్ ఎనలైజర్‌తో పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ కేంద్రంలో రిటర్నింగ్ అధికాకి సూచనలను ఉల్లంఘించిన, కౌంటింగ్‌కు ఆటంకం కల్గించేలా ప్రవర్తించే వారిని బయటికి పంపించడం జరుగుతుందన్నారు. లా అండ్ ఆర్డర్‌కు సంబంధించి జిల్లావ్యాప్తంగా నేటి నుంచి జూన్ 6వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. సోమ, మంగళవారం రెండు రోజులుపాటు డ్రైడేగా ప్రకటించడం జరిగిందన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు సెల్‌ఫోన్లు తీసుకువెళ్లడానికి వీలులేదన్నారు. సుమారు రెండు వేల మంది ఏజెంట్లు హాజరుకానున్నట్టు తెలిపారు.

విజయం మనదే

సానా సతీష్ క్యాంపు కార్యాలయంలో టీడీపీ, జనసేన అభ్యర్థుల ఆత్మీయ సమావేశం




టీడీపీ, జనసేన అభ్యర్థుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న నేతలు

కాకినాడ (ఆంధ్రజ్యోతి), జూన్ 3 : టీడీపీ కూటమి విజయం ఖాయం. మంగళవారం ఓట్ల లెక్కింపు ఫలితాల్లో కూటమి అఖండ మెజార్టీతో గెలవబోతోంది. జిల్లాలో అన్ని సీట్లు క్లీన్‌స్వీప్ చేయబోతోందని జిల్లా టీడీపీ, జనసేన అభ్యర్థులు ధీమా వ్యక్తంచేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్నికల కోఆర్డినేటర్ సానా సతీష్ ఆధ్వర్యంలో వీరంతా సోమవారం ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. కాకినాడ ఏడీబీ రోడ్డులోని సతీష్ క్యాంపు కార్యాలయంలో మధ్యాహ్న విందులో వీరంతా భేటీ అయ్యారు. మాజీ మంత్రులు యనమల, రాజప్ప, మాజీ ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వర్మతోపాటు ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి వరుపుల సత్యప్రభ, కాకినాడ రూరల్ నియోజకవర్గ జనసేన అభ్యర్థి పంతం నానాజీ, కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్న ఈ భేటీలో పలు అంశాలపై చర్చించారు. తొలుత యనమల మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సమయంలో టీడీపీ, జనసేన ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటమి భయంతో కౌంటింగ్ కేంద్రాల్లో గొడవలు చేయాలని వైసీపీ పథకం పన్నిన నేపథ్యంలో కూటమి ఏజెంట్లు ఎలాంటి కవ్వింపు చర్యలకు లోనవకుండా అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల నుంచి అసలు బయటకు రాకూడని వివరించారు. ఈ సందర్భంగా రాజప్ప, జ్యోతుల నెహ్రూ, వర్మ తదితరులు మాట్లాడుతూ కూటమి విజయం పక్కా అని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా నేతలంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ కూటమి అభ్యర్థులు ప్రతి ఒక్కరు కష్టించి పనిచేయడంతో మంచి ఫలితాలు సాధించబోతున్నామని తెలిపారు.


మండపేట పట్టణంలో బలగాల కవాతు


చెయ్యేరులోని కోనసీమ జిల్లా కౌంటింగ్ కేంద్రం వద్ద సిబ్బంది సందడి


పిఠాపురంలో పోలీసు బలగాల మోహరింపు

కౌంటింగ్‌కు రెడీ

● విస్తృత ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం అధికారులు ● కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏర్పాటు చేసిన మూడు కౌంటింగ్ కేంద్రాల వద్ద విస్తృత ఏర్పాట్లు చేశారు. రాజమహేంద్రవరం జిల్లాకు సంబంధించి ఆదికవి నన్నయ యూనివర్సిటీలో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. అలాగే కాకినాడ జిల్లాకు కాకినాడలోని జేఎన్టీయూకే కేంద్రంలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి చెయ్యేరు ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ నిర్వహిస్తున్నారు. మూడు లెక్కింపు కేంద్రాల వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ప్రతి కేంద్రాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు..


రాజమండ్రి నన్నయ వర్సిటీ కేంద్రం వద్ద తనిఖీలు


నన్నయ వర్సిటీ కౌంటింగ్ కేంద్రం


గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు



కాకినాడ జిల్లాకు సంబంధించి ఓట్లు లెక్కించే జేఎన్టీయూకే కౌంటింగ్ కేంద్రం


కాకినాడలో స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు




కాకినాడ కేంద్రంలో ఏర్పాట్లు


సమీక్ష నిర్వహిస్తున్న రవిప్రకాష్

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

అల్లర్లు జరగకుండా బలగాల మోహరింపు

పిఠాపురంలో పర్యటించిన డీఐజీ రవిప్రకాష్

పరిస్థితులపై ఎస్పీలతో సమీక్ష

పిఠాపురం, జూన్ 3: కౌంటింగ్ సమయంలోనూ, తదనంతరం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఐజీ ఎం.రవి ప్రకాష్ వెల్లడించారు. ఆయన సోమవారం సాయంత్రం పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించారు. సర్కిల్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, ప్రత్యేక పరిశీలకుడు, ఎస్పీ రామ్మోహనరావు, ఇతర పోలీసు అధికారులు స్థానికంగా ఉన్న పరిస్థితులపై సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో పిఠాపురం, కాకినాడ నియోజకవర్గాలు, తూర్పుగోదావరి జిల్లాలోని రాజానగరం నియోజకవర్గాలను సెన్సిటివ్‌గా గుర్తించినట్లు తెలిపారు. పిఠాపురం నియోజకవర్గంపై రాష్ట్రవ్యాప్తంగా దృష్టి ఉందని, ఈ నేపథ్యంలో పోలీసుశాఖాపరంగా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. పిఠాపురానికి ప్రత్యేకంగా ఎస్పీ స్థాయి అధికారిని నియమించామని, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు 50 మంది, సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీలు, క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు, పెట్రోలింగ్, మొబైల్ టీమ్‌లను రంగంలోకి దించామని వివరించారు. ఎక్కడా ఎటువంటి సంఘటన జరిగినా 15 నిమిషాల లోపుగానే అక్కడకు చేరుకునే విధంగా బలగాలను మోహరించామని చెప్పారు. జాతీయ రహదారితో పాటు కత్తిపూడి, సామర్లకోట, కాకినాడ రహదారులపై ప్రత్యేకంగా బందోబస్తు ఏర్పాటు చేసి అనుమతి లేని వారిని కాకినాడ వెళ్లకుండా చర్యలు చేపట్టామని తెలిపారు. లాడ్జీలు, హోటల్స్‌ల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనధికారిక, ఇతర ప్రాంతాల వ్యక్తులు ఉన్నట్లు గుర్తిస్తే వారిని పంపివేస్తున్నట్లు తెలిపారు. తాటిపర్తి, విరవాడ సహా సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల ఫలితాలు వెలువడే సమయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలు సంయమనం పాటించాలని, శాంతియుతంగా ఉండాలని కోరారు. ఎవరైనా గొడవలకు దిగినా, రెచ్చగొట్టే వాఖ్యలు చేసినా, దాడులు, కక్ష సాధింపు చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని, అల్లర్లు, గొడవలకు దిగే వారిపై ఆర్‌పీ యాక్టు, ఐపీసీ సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడంతో పాటు రౌడీ షీట్లు తెరుస్తామని హెచ్చరించారు. కేసుల్లో ఇరుక్కుని భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. సమావేశంలో ఎస్పీలతో పాటు కాకినాడ డీఎస్పీ హనుమంతరావు, ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురానికి భారీగా పోలీసు బలగాలు

నాలుగు ప్లాటూన్ల సీఐఎస్ఎఫ్, ఏపీఎస్పీ, ఏఎన్ఎస్ పార్టీలు

ఏసీబీ ఎస్పీ రామ్మోహనరావు



పిఠాపురం, జూన్ 3: కౌంటింగ్ సమయంలో, అనంతరం పిఠాపురం నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిగా నియమితులయిన ఏసీబీ ఎస్పీ రామ్మోహనరావు సోమవారం రాత్రి వెల్లడించారు. నియోజకవర్గంలో రెండు ప్లాటూన్ల సీఐఎస్ఎఫ్, ఒక ప్లాటూన్ ఏపీఎస్పీ బలగాలతో పాటు ఒక ప్లాటూన్ ఏఎన్ఎస్ పార్టీ, సివిల్ పోలీసులు 100 మంది, ఇతర విభాగాలు నుంచి 25 మందిని బందోబస్తు నిమిత్తం వినియోగిస్తున్నామని వివరించారు. ఏడు క్విక్ రెస్పాన్స్ టీములు, ఏడు మొబైల్ టీములు, ఒక స్ట్రైకింగ్ ఫోర్స్, రెండు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులు, వజ్ర వాహనం, రోప్ పార్టీలను రంగంలోకి దించామని తెలిపారు. 25 ప్రాంతాల్లో పోలీసు పికెట్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమస్యాత్మకంగా గుర్తించిన 18 గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, సమస్యలు సృష్టించే 30మందిని గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని చెప్పారు. 509 మందికి సెక్షన్ 149 కింద నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్, ఎలక్షన్ అధికారులు అనుమతి పొందిన ఏజెంట్లు, అభ్యర్థులు, వారి తరపు ప్రతినిధులు మినహా మిగిలిన వారు కాకినాడ కౌంటింగ్ కేంద్రం పరిసరాల్లోకి వెళ్లేందుకు అనుమతి లేదని చెప్పారు.

డైరెక్టర్ బుచ్చిబాబుకు నాగబాబు పరామర్శ


బుచ్చిబాబును పరామర్శిస్తున్న నాగబాబు

కొత్తపల్లి, మే 3: పితృ వియోగంతో బాధపడుతున్న సినీ డైరెక్టర్ సానా బుచ్చిబాబును కొత్తపల్లిలో సోమవారం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు పరామర్శించారు. తండ్రి లేని లోటు తీర్చడం ఎవరికీ సాధ్యం కాదన్నారు. మనో నిబ్బరంతో తదుపరి కార్యక్రమాన్ని కొనసాగించాలని ధైర్యం చెప్పారు. పలువురు జనసేన నాయకులు, పవన్‌కల్యాణ్ అభిమానులు పరామర్శించారు.

వక్ర పాదాల సమస్యకు శాశ్వత పరిష్కారం


చికిత్సా శిబిరానికి హాజరైన చిన్నారులు, తల్లులు


జీజీహెచ్ (కాకినాడ) జూన్ 3 వక్ర (వంకర) పాదాలతో పుట్టిన పిల్లల అంగ వైకల్యానికి క్యూ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్ట్ (సీఐఐటీ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ జీజీహెచ్‌లో పూర్తిస్థాయి చికిత్సను అందించడం ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆర్థోపెడిక్ విభాగాధిపతి డా.ఎంపీఆర్ విఠల్ అన్నారు. వరల్డ్ క్లబ్ ఫుట్ డే సందర్భంగా సోమవారం జీజీహెచ్ ఆర్థో విభాగంలో వక్ర పాదాలతో పుట్టిన పిల్లలకు ప్రత్యేక చికిత్సను అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.ఎస్.లావణ్యకుమారి, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్, అనస్థీషియా విభాగాధిపతి డా. ఏ విష్ణువర్ధన్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా.విఠల్ మాట్లాడుతూ పుట్టుకతో వచ్చే వక్రపాదాల అంగవైకల్యం సాధారణంగా మేనరికపు వివాహాలు లేదా గర్భస్థ సమయంలో వాడకూడని మందులు వాడడం లేదా గర్భం దాల్చిన సమయంలో తల్లికి కొన్ని జబ్బులు రావడం లేదా జన్యుపరమైన కొన్ని కారణాల వల్ల లేదా వంశపారంపర్యంగా సంక్రమించే పరిస్థితులు ఉన్నాయన్నారు. వక్ర పాదంతో జన్మించిన శిశువుకు శస్త్రచికిత్స లేకుండా పూర్తిగా సమస్యను పరిష్కరించవచ్చన్నారు. పాన్సెట్టి పద్ధతి ద్వారా చికిత్స అందించవచ్చన్నారు. సమస్య జటిలంగా ఉంటే టినాటిమి అనే చిన్న శస్త్రచికిత్స ద్వారా నయం చేయవచ్చన్నారు. చికిత్స అనంతరం ఫ్యాబ్ ఫుట్ అబ్‌డక్షన్ బ్రేస్ అనే ప్రత్యేక షూస్ చిన్నారులకు ధరింప చేసి తల్లిదండ్రుల ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించవచ్చన్నారు. తద్వారా పిల్లల పాదాలు సాధారణ స్థాయికి వచ్చి అందరిలాగే వారి భవిష్యత్తు బంగారమయమవుతుందన్నారు. ఈ సీఐఐటీ సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ జీజీహెచ్‌లో 2017 నుంచి ఇప్పటి వరకు 249 మంది చిన్నారులకు చికిత్స అందజేసినట్లు చెప్పారు. సోమవారం మరో 22 మంది చిన్నారుల పేర్లు నమోదు చేసి చికిత్స అందజేస్తున్నామన్నారు. ఈ ప్రత్యేక వైద్య చికిత్సకు సంబంధించిన ఖర్చు అంతా సీఐఐటీ స్వచ్ఛంద సంస్థ భరిస్తుందన్నారు. వక్ర పాదాలతో జన్మించిన పిల్లలకు ప్రతి గురు, శుక్రవారాల్లో జీజీహెచ్ ఆర్థో విభాగంలో ప్రత్యేక వైద్య చికిత్స అందించనున్నట్లు చెప్పారు. ఎవరైనా వక్ర పాదాలతో బాధపడుతున్నట్లయితే ఆంధ్రప్రదేశ్ క్యూర్ క్లబ్ ఫుట్ సంస్థ హెల్ప్‌లైన్ నెంబర్ 8800020503లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆర్థో వైద్య నిపుణులు డా. ముఖర్జీ, డీసీఎస్ఆర్ఎంఓ డా.అనిత, క్యూర్ ఇండియా సంస్థ కోఆర్డినేటర్ ఎస్.కిరణ్‌రాయ్, ఆర్థో విభాగ పీజీలు పాల్గొన్నారు.

చింత చిగురు ధర పైపైకి



కరప, జూన్ 3: వేసవికాలంలో దొరికే చింత చిగురును ఇష్టపడనివారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ఎన్నో ఔషధ గుణాలున్న ఈ చింత చిగురు ధర ఆకాశాన్నంటుతుంది. చింత చిగురు ధర ప్రస్తుతం చిటారు కొమ్మకు చేరడంతో ఆహార ప్రియులు దాన్ని కొనేందుకు జంకుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రిటైల్‌గా కేజీ ధర రూ.400ల వరకు పలుకుతోంది. పట్టణ ప్రాంతాల్లో అయితే రూ.600ల వరకు ఉంటుందని వినియోగదారులు చెబుతున్నారు. చింత చిగురులో ఎక్కువ ప్రొటీన్లు, తక్కువ కొవ్వు పదార్థాలు కలిగి ఔషధ గుణాలు సమృద్ధిగా ఉండడంతో పాటు ఏ కూరలో వేసుకున్నా మంచి రుచిని కలిగిస్తుంది. అందుచేత చింత చిగురుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఏర్పడింది.

పూనమ్ చతుర్వేదికి బాహుబలి కాజా



రాజమహేంద్రవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో కెల్లా పొడవైన అమ్మాయి పూనమ్ చతుర్వేదికి సురుచి బాహుబలి కాజా సోమ వారం అందించారు. కోయంబత్తూరులో జరుగుతున్న బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌కు చెన్నై నుంచి వెళుతుండగా ఆమెను రాజ మహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో సురుచి పీఆర్‌వో వర్మ కలిసి కాజా, స్వీట్స్ అందించారు. పూనమ్ చతుర్వేది ఈస్ట్రన్ రైల్వే ఉద్యోగి, బాస్కెట్ బాల్ ప్లేయర్. ఆమె రైలు దిగడంతో ప్రయాణికులు ఆశ్చర్యంగా చూశారు. పలువురు ఆమెతో ఫొటో తీయించుకున్నారు.



అన్నదాన భవన నిర్మాణానికి

రూ.లక్ష విరాళం

ఆత్రేయపురం, జూన్ 3: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కలిదిండికి చెందిన మన్నె అశోక్‌గజపతిరాజు కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళం సమర్పించారు. వివిధ సేవల ద్వారా సోమవారం ఒక్కరోజు ఆదాయం రూ.2,95871 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. వాడపల్లి వెంకన్న ఆలయానికి సోమవారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారని చెప్పారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారని ఆయన చెప్పారు.

ఒమ్మంగి యువకుడి హత్య కేసులో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు, జూన్ 3: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామానికి చెందిన యువకుడు మొగలి సతీష్ హత్య కేసులో నిందితులను సోమవారం స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్ఐ ఎం.పవన్‌కుమార్ విలేకరులకు అందించారు. ఒమ్మంగి గ్రామానికి చెందిన మొగలి సతీష్(33) మే 4న జ్యూస్ తాగి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అలా వెళ్లిన తన భర్త తిరిగి రాలేదని భార్య మొగలి విజయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే 4వ తేదీ రాత్రి ఒమ్మంగికి చెందిన బుర్రా దొరబాబు సతీష్‌ను ధర్మవరం గ్రామ శివారు పోలవరం కాలువ గట్టు వద్దకు రప్పించి ఒమ్మంగికి చెందిన గాడిదల లోవరాజు అనే వ్యక్తి సహాయంతో సతీష్‌ను ఇనుప రాడ్‌తో కొట్టి హత్య చేశాడు. అనంతరం లోవరాజు సహాయంతో సతీష్ మృతదేహాన్ని, సతీష్ బండిని ట్రాక్టర్‌పై వేసి ఉత్తరకంచి, పొదురుపాక పొలాల సరిహద్దుకు తరలించారు. దొరబాబు మామగారు అయిన వాయిలశెట్టి విశ్వనాథం సహాయంతో ఉత్తరకంచి పొదురుపాక సరిహద్దు సర్వే తోటల్లో గొయ్యి తీసి సతీష్ మృతదేహాన్ని పాతిపెట్టారు. అనంతరం సతీష్ మోటార్ బైక్‌ను ఎవరికీ అనుమానం రాకుండా మే 5వ తేదీ రాత్రి పెదమల్లాపురం గ్రామ శివారులో పెట్రోల్ పోసి దొరబాబును తగలబెట్టారు. అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్న దొరబాబు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతి వద్ద లొంగిపోయి వ్యక్తిగత కక్షలతోనే తాను 4వ తేదీ రాత్రి మొగలి సతీష్‌ను హత్య చేసినట్లు చెప్పాడు. స్థానిక సీఐ ఎం.శేఖర్‌బాబు, ఎస్ఐ ఎం.పవన్‌కుమార్, తహసీల్దార్ నరసింహారావు పూడ్చిపెట్టిన ప్రదేశాన్ని పరిశీలించి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టంకు తరలించారు. ఈ కేసులో నిందితులైన బుర్రా దొరబాబు ఒమ్మంగిలోను, గాడిదల లోవరాజును రాచపల్లిలో అరెస్ట్ చేసి స్థానిక కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు తెలిపారు. దొరబాబుకు సహకరించిన అతని మామ వాయిలశెట్టి విశ్వనాథాన్ని అరెస్ట్ చేయాల్సి ఉందని అతని కోసం గాలింపు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మధ్యవర్తిత్వంలో న్యాయవాదులకు తర్ఫీదు

పీడీజే గంధం సునీత


వివరాలు వెల్లడిస్తున్న జడ్జి సునీత

రాజమహేంద్రవరం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాలకు చెందిన 30 మంది న్యాయవాదులకు 7వ తేదీ వరకూ మధ్యవర్తిత్వంలో తర్ఫీదు ఇస్తున్నామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత పేర్కొన్నారు. ఢిల్లీకి చెందిన సీనియర్ ట్రైనర్లు వినయ్ కుమార్ గుప్తా, సునీల్ కుమార్ అగర్వాల్ మొత్తం 40 గంటలపాటు శిక్షణ ఇస్తారన్నారు. సుప్రీంకోర్టు వారి మధ్యవర్తిత్వం, రాజీమార్గ పథక సంఘం(ఎంసీపీసీ), రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మధ్యవర్తిత్వం వల్ల సమయం వృథా కాదని, త్వరితగతిన ప్రయోజనం చేకూరుతుందని ఆమె స్పష్టం చేశారు. ఖర్చులు లేకపోవడమే కాకుండా సామరస్య పూర్వకంగా కేసులు పరిష్కారం అవుతాయన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, జూన్ 3: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి ఆన్‌లైన్ ద్వారా ఒకదాత రూ.1,01,511 విరాళంగా అందజేసినట్లు ఆలయ పీఆర్వో విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. ఒడిస్సా రాష్ట్రం గంజానికి చెందిన తాడికొండ ప్రవీణ్‌కుమార్ ఈ మొత్తాన్ని అందించారని, వారికి డోనార్ కోటాలో దేవస్థానం అందించే సదుపాయాలను అమలుచేయనున్నట్టు వివరించామని పేర్కొన్నారు.

తప్పుడు సర్వేలతో ప్రజలను మభ్యపెట్టలేరు

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, జూన్ 3: తప్పుడు సర్వేలతో ప్రజలను మభ్యపెట్టలేరని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ వ్యాఖ్యానించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ గెలుపుపై ఆత్మసాక్షి సంస్థ చేసిన సర్వేను ఆయన తప్పుపట్టారు. క్షేత్రస్థాయిలో తిరగకుండా సర్వే చేస్తే ఇలాగే ఉంటుందన్నారు. పవన్ రాష్ట్రంలోనే రికార్డుస్థాయి మెజార్టీతో విజయం సాధించబోతున్నారని తెలిపారు. కనీసం 50-60వేలు నుంచి 80వేలు, లక్ష వరకూ మెజార్టీ సాధించే అవకాశం ఉందని చెప్పారు. టీడీపీ కేడర్‌తో పాటు జనసైనికులు, వీరమహిళలు, అన్నివర్గాల ప్రజలు పవన్‌కు ఓటు వేశారని తెలిపారు. చంద్రబాబుకు ఇచ్చిన మాట ప్రకారం తాను, తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తి అంకితభావంతో పవన్ కోసం పనిచేశారని చెప్పారు. పవన్ సాధించే మెజార్టీపై తాను ఏ చానల్‌లో అయినా చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత ఏనాడు నియోజకవర్గ ప్రజల కష్టాలు పట్టించుకోలేదని విమర్శించారు. సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నా, తుఫాన్‌కు నష్టపోయినా కనీసం రైతులను పరామర్శించలేదని తెలిపారు. పురుషోత్తపట్టణ ఎత్తిపోతల పథకాన్ని నిరుపయోగంగా మార్చి పంటలు ఎండబెట్టారని, కమిషన్ సొమ్ములు కోసం ఏలేరు నీటిని తాండవకు అమ్ముకున్నారని ఆయన ఆరోపించారు.

ఓట్ల లెక్కింపు విజయవంతానికి కృషి : రాజప్ప

సామర్లకోట, జూన్ 3: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం జరుగనున్నందున కూటమి పార్టీలైన టీడీపీ-జనసేన-బీజేపీ కార్యకర్తలు ప్రశాంత వాతావరణంలో లెక్కింపు విజయవంతానికి కృషిచేయడం ద్వారా ఎన్నికల అధికారులకు సహకరించాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సూచించారు. సోమవారం సాయంత్రం పార్టీ కార్యకర్తలకు చినరాజప్ప ప్రత్యేక సందేశాన్ని అందించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు చేసినందున అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడినా పట్టించుకోవద్దన్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం విజయోత్సవాలు, సమావేశాలు, ప్రదర్శనలు పూర్తిగా నిషేధించినందున కార్యకర్తలు సహకరించాలని రాజప్ప కోరారు.

'కౌంటింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి'

సర్పవరం జంక్షన్, జూన్ 3: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలంతా కూటమికే మొగ్గు చూపారని ఆ విషయం అన్ని ఎగ్జిట్ పోల్స్‌తో స్పష్టమైందని, మంగళవారం జరిగే ఓట్ల లెక్కింపులో పోలింగ్ ఏజెంట్లు పూర్తి అప్రమత్తంగా ఉండాలని కాకినాడ రూరల్ జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) కోరారు. సోమవారం వలసపాకల జనసేన పార్టీ కార్యాలయంలో పోలింగ్ ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌంటింగ్‌లో ఏమైనా సమస్యలుంటే నేరుగా అక్కడ ఉన్న లెక్కింపు అధికారులు, సూపర్‌వైజర్లకు ఫిర్యాదు చేయాలన్నారు. కౌంటింగ్‌లో ఇతర పార్టీల వారితో ఎటువంటి వాదనలు పెట్టుకోకుండా సంయమనం పాటించాలని జనసైనికులు, టీడీపీ, బీజేపీ నాయకులను కోరారు. సంయమనంతో కౌంటింగ్ పూర్తయ్యే చివరి నిమిషం వరకు కౌంటింగ్ సెంటర్‌లోనే ఉండాలని సూచించారు.

'నేడు దుకాణాలు మూసివేయాలి'

పిఠాపురం, జూన్ 3: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని అధికారుల సూచనల మేరకు మంగళవారం పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల పరిధిలో వ్యాపారస్తులు అందరూ తమ దుకాణాలను మూసివేయాలని పిఠాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ సూచించింది. ఈ మేరకు చాంబర్ అధ్యక్షుడు పంతం శ్రీనివాసరావు సోమవారం రాత్రి ప్రకటన విడుదల చేశారు. సెక్షన్ 144 అమలులో ఉన్నందున దుకాణాలు, ముఖ్యకూడళ్లల్లో గుమికూడవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని సూచించారు.

నేడు ర్యాలీలు, ఊరేగింపులు నిషేధం

జగ్గంపేట, జూన్ 3: మంగళవారం ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఎటువంటి ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతులు లేవని జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. సర్కిల్ వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. ఎక్కడైనా సంబరాలు జరిపినా జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు.

రౌతులపూడి: ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మండల గ్రామాల్లో ఊరేగింపులు, ర్యాలీలు నిషేధమని రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ సోమవారం ప్రకటనలో తెలిపారు. 144 సెక్షన్ ఉత్తర్వులు ఉన్నందున బాణసంచా కాల్చులు, ర్యాలీలు చేయరాదన్నారు. ఎవరైనా వ్యతిరేకంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు రైతు బజారు సెలవు

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 3: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా 144 సెక్షన్ అమల్లో ఉంచడం, కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూ నిబంధనలు ఉన్నందున నగరంలో రైతు బజారు సభ్యులందరికీ, వినియోగదారులకు పూర్తి స్థాయిలో సెలవు ప్రకటించారు.

రేపు నీలమ్మ తల్లి జాతర ఉత్సవాలు

సామర్లకోట, జూన్ 3: పట్టణ పరిధిలో నీలమ్మ చెరువు వద్ద ఉన్న నీలమ్మ తల్లి ఆలయంలో బుధవారం జాతర ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఉత్సవ కమిటీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సిరి బొమ్మకు విశేష పూజలు నిర్వహించి అమ్మవారిని గరగలతో సంబరం నిర్వహించనున్నట్టు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకోవాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

విద్యార్థులను అలరించిన 'ఓరుగామి'

తాళ్లరేవు, జూన్ 3: నీలపల్లి హైస్కూల్లో జనవిజ్ఞాన వేదిక యానాం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం బాలల వేసవి వినోద కార్యక్రమంలో నిర్వహించిన ఓరుగామి కార్యక్రమం విద్యార్థులను అలరించింది. డ్రాయింగ్, చిత్రలేఖన ప్రాముఖ్యతను ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం వివరించారు. పి.గన్నవరం ఉపాధ్యాయుని బి.చిట్టితల్లి కాగితాలతో వివిధ ఆకృతులు తయారుచేసి ఓరుగామి క్రాఫ్ట్‌పై వివరించారు. యానాం కమిటీ ఉపాధ్యక్షుడు దంగేటి త్రిమూర్తులు, ప్రధానోపాధ్యాయుడు ఫణిశర్మ, జనవిజ్ఞాన వేదిక సమతా నాయకురాలు కాశి కరుణ, యానాం కమిటీ కార్యదర్శి దుర్గామహాలక్ష్మి, యూటీఎఫ్ నాయకుడు కె.సురేష్, ఇళ్ల సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు అవగాహన తరగతులు

కాకినాడ సిటీ, జూన్ 3: పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో గత నెల 21న స్థానిక యూటీఎఫ్ హోంలో ప్రారంభించిన అవగాహన తరగతులు 14వ రోజు సోమవారం కొనసాగాయి. గణితం సబ్జెక్టును శ్రీనివాస్, ఆంగ్లం సబ్జెక్టును ఝాన్సీ బోధించారు. ఉపాధ్యాయులతో రోజూ ఉదయం 6 నుంచి 10 గంటల వరకు బోధించడం జరుగుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. క్లాసులను యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రవి చక్రవర్తి, నాయకులు సీహెచ్‌వీ రమణ, వరహాలుబాబు, కేఎంకే.మూర్తి, పి.గిరిధర్, గోపాల్, తానీషా, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు ఎ.సంజయ్, ఎ.వాసు పర్యవేక్షించారు.

ధ్వంసమైన ఉప్పాడ- పిఠాపురం రహదారి

వర్షం నీటితో చెరువులా మారిన గోతులు

గాయాలపాలవుతున్న ప్రయాణికులు

కొత్తపల్లి, జూన్ 3: ఉప్పాడ- పిఠాపురం ఆర్అండ్‌బీ రోడ్డు పలు చోట్ల గోతులు ఏర్పడి ధ్వంసమైంది. చిన్న, చిన్న గోతులు పడిన చోట్ల సంబంధితశాఖ నిర్లక్ష్య వైఖరి అవలంబించడంతో గొయ్యిలు పెద్ద అగాధాల్లా తయారయ్యాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ గోతుల్లోకి నీరు చేరడంతో రోడ్డు చెరువును తలపిస్తుంది. తుఫాన్ కారణంగా సముద్రకెరటాలు బీచ్‌రోడ్డుపైకి దూసుకొచ్చిన నేపథ్యంలో రోడ్డుపై రాళ్లు చెల్లాచెదురుగా పడ్డాయి. దీంతో తాత్కాలికంగా ఉప్పాడ బీచ్‌రోడ్డులో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దీంతో బీచ్‌రోడ్డును కాకినాడ వెళ్లాల్సిన వాహలన్నీ పిఠాపురం, గోర్స, పండూరు రోడ్డులో ప్రయాణిస్తున్నాయి. అధికశాతం వాహనాలు పిఠాపురం మీదుగా వెళ్లాల్సిరావడం, ధ్వంసమైన గోతుల్లో వర్షం నీరు చేరడంతో వాహనాల రద్దీకి రోడ్డు మరింత దుస్థితికి చేరింది. రోడ్డుపై గొయ్యిలు ఎక్కడ ఉన్నాయో గమనించకుండా ప్రయాణికులు అగాధాల్లో పడి తీవ్ర గాయాలపాలవుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడి గోతులు అక్కడ వదిలివేయడంతో ఆ గోతులు పెద్ద బంటాగొయ్యిలా తయారయ్యాయని ప్రయాణికులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. కొత్త ప్రభుత్వంలో ఆర్అండ్‌బీ రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



ఉప్పాడ- పిఠాపురం రహదారిలో వర్షపు నీరు

జనసేన అభ్యర్థులు విజయం సాధించాలని పూజలు



పిఠాపురం జైగణేష్ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న జనసేన నాయకులు

పిఠాపురం, జూన్ 3: జనసేన అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పవన్‌కల్యాణ్, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ సహా రాష్ట్రంలోని జనసేన అభ్యర్థులందరూ విజయం సాధించాలని కోరుకుంటూ ఆ పార్టీ నాయకులు పిఠాపురంలోని కోటగుమ్మం సెంటర్‌లో జైగణేష్ దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జైగణేష్‌కు పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చన జరిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవుని ఆశీస్సులు పవన్‌పై ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో జనసేనతో సహా కూటమి అభ్యర్థులంతా ఘన విజయం సాధించబోతున్నారని చెప్పారు. పూజల్లో జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్, తెలంగాణ ఇన్‌చార్జి శంకరగౌడ్, పిఠాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు, సూరవరపు సురేష్, పిల్లా శివశంకర్, దేవరపల్లి చినబాబు, దానం లాజర్‌బాబు, దంగేటి దొరయ్య, వెన్నా చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పవన్ విజయం కోసం చండీహోమం

పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ భారీ మెజార్టీతో విజయం సాధించాలని కోరుతూ పట్టణంలోని పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో సోమవారం చండీహోమం నిర్వహించారు. విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గానికి చెందిన జనసేన నేత నక్కా శ్రీధర్ దంపతులు ఈ హోమాన్ని జరిపించారు. జనసేనాని రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని, కూటమి అభ్యర్థులందరూ విజయం సాధించాలని హోమం నిర్వహించినట్టు నక్కా శ్రీధర్ తెలిపారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరిదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. చండీహోమంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, విశాఖ జిల్లాకు చెందిన జనసైనికులు, వీరమహిళలున్నారు.



చండీహోమం నిర్వహిస్తున్న నక్కా శ్రీధర్

కూటమి గెలవాలని హోమం



పి.మల్లవరంలో నిర్వహిస్తున్న హోమం

తాళ్లరేవు, జూన్ 3: టీడీపీ కూటమి గెలవాలని, చంద్రబాబు సీఎం అవ్వాలని తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ ఆధ్వర్యంలో పి.మల్లవరంలో సోమవారం హోమం నిర్వహించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన బాలాత్రిపురసుందరి టీం సభ్యులు హోమం, పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సతీమణి పార్వతి, కుమార్తె శ్రావ్య, మాజీసర్పంచ్ ధూళిపూడి ఈశ్వరిసుబ్బారావులు పూజలను ఆచరించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు, అమలాపురం పార్లమెంటు ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ అధిక మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నిమ్మకాయల సత్యనారాయణమూర్తి, దడాల సత్తికొండ, ఆనాల పాపారావు, రాయుడు సింహాచలం, తిరుమల ఉన్నారు.

ఎన్నికల కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి

కాకినాడ ఆర్వో వెంకటరావు



కౌంటింగ్ కేంద్రం వద్ద పరిశీలనలో ఆర్వో

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 3: ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు తెలిపారు. స్థానిక జేఎన్‌టీయూకే ఆవరణలో కౌంటింగ్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు మూడవ విడత శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బంది కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా కౌంటింగ్‌పై సంపూర్ణ అవగాహన కల్పించామని, తీసుకున్న శిక్షణకు అనుగుణంగా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసే వరకు ఎన్నికల సిబ్బంది పాత్రపై సూచనలు ఇచ్చి అవగాహన కల్పించారు. అదే సమయంలో కౌంటింగ్ ఏజెంట్లు కూడా నిబంధనలు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ఉదయం 6గంటలకల్లా కౌంటింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, ఏఆర్వో చల్లన్నదొర, ఎన్నికల డీటీలు నాయుడు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయం 8గంటలకు ప్రారంభం..

కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8గంటలకు ప్రారంభిస్తామని ఆర్వో జె.వెంకటరావు తెలిపారు. కౌంటింగ్ సందర్భంగా సుమారు 450మంది విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. 14టేబుల్స్ ఏర్పాటు చేశామని, 15 రౌండ్లు ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. అలాగే సర్వీసు ఓటర్లు, పోస్టల్ బ్యాలెట్ కోసం మరో 5 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 3,221మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని చెప్పారు. అలాగే హోం ఓటింగ్ ద్వారా 45మంది, సర్వీస్ ఓటర్లు 33మంది ఓట్లు వేశారని చెప్పారు.

యనమల, రాజప్పను కలుసుకున్న నాయకులు



యనమలను సత్కరించిన టీడీపీ నేతలు నులుకుర్తి వెంకటేశ్వరరావు, చప్పిడి వెంకటేశ్వరరావు

సర్పవరం జంక్షన్, జూన్ 3: టీడీపీ కాకినాడ రూరల్ ఎన్నికల కోఆర్డినేటర్ నులుకుర్తి వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు సోమవారం తిమ్మాపురంలో మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, అచ్చంపేటలో నిమ్మకాయల చినరాజప్పను కలుసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి గెలుపు కోసం టీడీపీ శ్రేణులంతా కష్టించి పని చేశారని, ఓట్ల బదలాయింపు చక్కగా జరిగిందని అత్యధిక మెజారిటీతో కాకినాడ రూరల్ కూటమి అభ్యర్థి పంతం నానాజీ, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ విజయం సాధించడం ఖాయమని మాజీ మంత్రులకు వివరించారు. కార్యక్రమంలో నులుకుర్తి జగన్నాథం, వనుం ఉపేంద్ర, బిక్కిన సత్తిబాబు, దమ్ము నూకరాజు తదితరులు ఉన్నారు.

'కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి'

ఏలేశ్వరం, జూన్ 3: కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు రొంగల ఈశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం చిన్నింపేట జీడిపిక్కల పరిశ్రమ ఎదుట కార్మికులు ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాస్తున్న యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలో పనిచేసే సుమారు 80మంది కార్మికులకు ఉపాధి లేకుండా చేసిందని, తాము వచ్చి చర్చించి సమస్యలపై నిర్ణయం తీసుకుంటామని అప్పటి వరకూ వారికి పనులు అప్పగించాలని కార్మిక శాఖ అధికారులు ఆదేశించినా యాజమాన్యం కార్మిక హక్కులను కాలరాస్తుందన్నారు. తక్షణం అధికారులు కార్మికులను పరిశ్రమలోకి తీసుకొనేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.అప్పారావు, వి.సతీష్, కుమారి, సూర్యావతి, రత్నం, నాని, ప్రియాంక, గౌరీ ఉన్నారు.

ప్రజలంతా శాంతిభద్రతలను పరిరక్షించాలి

జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతుల

జగ్గంపేట, జూన్ 3: ఎన్నికల్లో చివర అంకమైన కౌంటింగ్ దశకు చేరుకున్నామని, ప్రజలంతా శాంతిభద్రతలను పరిరక్షించాలని జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. సోమవారం ఆయన ఒక వీడియో విడుదల చేశారు. ప్రస్తుతం 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ర్యాలీలు, బాణసంచా కాల్చడంవంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఒకే చోట పదిమంది గుమిగూడి ఎదుటి వారిని ఇబ్బంది పెట్టే పరిస్థితులు తీసుకురావద్దన్నారు. విజయం ఏ వైపు ఉందో ఇప్పటికే అందరికీ అర్థం అయిపోయిందన్నారు. నిబంధనలు అనుసరించి ఈ నెల 6న దాటిన తరువాత ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం ఏ కార్యక్రమం చేసుకున్నా ఇబ్బంది లేదని, అప్పటివరకు ఓపిక పట్టాలన్నారు. సమావేశంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి, నియోజకవర్గ ఎన్నికల కో ఆర్డినేటర్ ఎస్వీఎస్ అప్పలరాజు, జాతీయ టీడీపీ ఎన్టీఈసీ కార్యనిర్వాహక కార్యదర్శి దాపర్తి సీతారామయ్య పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లకు వర్క్‌షాప్

ప్రతి పోలింగ్ ఏజెంట్ క్రమశిక్షణతో ఓట్ల కౌంటింగ్‌ను పరిశీలించాలని జ్యోతుల నెహ్రూ సూచించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం నెహ్రూ ఆధ్వర్యంలో కౌంటింగ్ ఏజెంట్లకు వర్క్‌షాప్ నిర్వహించి అవగాహన కల్పించారు. కౌంటింగ్‌కు గంట ముందు ప్రతి పోలింగ్ ఏజెంటు హాజరవ్వాలని వారిచ్చిన ఐడీకార్డు ఫారం 18 కాపీ తీసుకెళ్లాలని, ఎట్టి పరిస్థితుల్లో సెల్‌ఫోన్ తీసుకెళ్లవద్దన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కన్నబాబు, భరత్‌బాబు ఉన్నారు.

నెహ్రూకు అభినందన

జ్యోతుల నెహ్రూకు కాకినాడ రూరల్ మండలం వేలంకి గ్రామానికి చెందిన జ్యోతుల నెహ్రూ అభిమాని జమ్మి కృష్ణ తదితరులు గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ టీడీపీ నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, జంపన సీతారామచంద్రవర్మ, సుంకవిల్లి రాజు, గోరిజాల వెంకన్నదొర తదితరులున్నారు.

టీడీపీ శ్రేణులు సంయమనం పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొండబాబు

కాకినాడ సిటీ కూటమి అభ్యర్థి కొండబాబు

కాకినాడ సిటీ, జూన్ 3: ఎన్నికల ఫలితాల్లో మనం విజయం సాధించబోతున్నామని, కౌంటింగ్ సమయంలో పార్టీ శ్రేణులందరూ సంయమనం పాటించాలని కాకినాడ సిటీ నియోజకవర్గ టీడీపీ, జనసేన బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యంగా పార్టీ శ్రేణులందరూ కష్టపడి పని చేశారని, ప్రజలందరూ మన విజయానికి ఓట్లు వేసి సహకరించారన్నారు. అయితే అవతలి వాళ్లు కొంత మంది ఓడిపోతామనే భయంతో కౌంటింగ్‌లో కవ్వింపు చర్యలకు పాల్పడటానికి, గొడవలు సృష్టించడానికి ప్లాన్ చేస్తున్నారన్నారు. కవ్వింపు చర్యలకు పాల్పడిన, గొడవలు సృష్టించినవారిపై చట్టపరంగా పోలీస్ డిపార్ట్‌మెంట్, ప్రభుత్వ పరంగా చర్యలుంటాయన్నారు. మనకు గాని, మన పార్టీకి గాని క్రమశిక్షణ గల పార్టీగా మంచి పేరుందని, పార్టీ శ్రేణులందరూ కూడా సయయమనం పాటించి సహకరించాలన్నారు. ఎన్నికల ఫలితాలలో మనం విజయం సాధించబోతున్నామని, విజయోత్సవంలో మనందరం పాల్గొని సంబరాలు చేసుకుందామని కొండబాబు పేర్కొన్నారు.

క్రమశిక్షణతో పరిశీలించాలి

ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఓట్ల లెక్కింపును పరిశీలించాలని వనమాడి కొండబాబు సూచించారు. జిల్లా టీడీపీ పార్టీ కార్యాలయంలో కౌంటింగ్ ఏజెంట్లకు కొండబాబు వర్క్ షాప్ నిర్వహించి అవగాహన కల్పించారు. గంట ముందు ఉదయం 6 గంటలకు కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రం వద్దకు హాజరు కావాలన్నారు. రిటర్నింగ్ అధికారి ఇచ్చే ఐడీ కార్డు, ఫారం 18 కాపీ లోపలికి తీసుకెళ్లాలన్నారు. సెల్‌ఫోన్‌కు అనుమతి లేనందున తీసుకెళ్లరాదన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు వారికి కేటాయించిన టేబుల్ వద్ద మాత్రమే ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోను పక్క టేబుల్ వద్దకు వెళ్లరాదన్నారు. నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు,కౌంటింగ్ ఏజెంట్లు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లు తోడ్పాటునందించాలి

ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి సత్యప్రభ



టీడీపీ నేతలను కలిసిన సత్యప్రభ

ప్రత్తిపాడు, జూన్ 3: కాకినాడ జేఎన్‌టీయూలో అంబేద్కర్ భవన్‌లో మంగళవారం జరిగే ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు టీడీపీ కౌంటింగ్ ఏజెంట్లు తోడ్పాటు నందించాలని ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ కౌంటింగ్ నియమ నిబంధనలను గౌరవించాలన్నారు. ఎటువంటి అల్లర్లకు తావులేకుండా శాంతిభద్రతలకు సహకరించి ప్రశాంతంగా ఓట్ల లెక్కింపునకు దోహదపడాలని ఆమె కోరారు. అలాగే ఫలితాలు వెలువడిన తరువాత కూటమి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు శాంతిభద్రతలు ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఆమె కాకినాడ వెళ్లి మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ కూటమి అభ్యర్థులు, నాయకులను కలిశారు.

9 వరకు ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే



ఒమ్మంగి సర్వేలో ఎంఈవో, సిబ్బంది

ఎంఈవో అచ్చిరాజు

ప్రత్తిపాడు, జూన్ 3: సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకుల ఆదేశాల మేరకు ప్రత్తిపాడు మండలంలో ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే జూన్ 9 వరకు కొనసాగుతుందని ఎంఈవో ఎస్.అచ్చిరాజు తెలిపారు. భవితా ఉపాధ్యాయులు ద్వారా జరుగుతున్న ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే ఒమ్మంగి గ్రామంలో సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో 40 ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించామన్నారు. వినికిడి, దృష్టి లోపం, మానసిక ఎదుగుదల, మరగుజ్జు, చలనవైకల్యం, మస్తిష్క పక్షవాతం, తలసేమియా వంటి ప్రత్యేక అవసరాల పిల్లలను అంగన్‌వాడీ, సచివాలయాల కేంద్రం ద్వారా గుర్తించడం జరుగుతుందన్నారు. అలాగే గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రత్యేక అవసరాల బాలలను గుర్తిస్తున్నట్టు ఎంఈవో తెలిపారు. భవిత కేంద్రం ద్వారా దివ్యాంగుల పిల్లలకు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు, శిక్షణా కార్యక్రమాలు, ఫిజియోథెరపీ వంటివి తల్లిదండ్రులు వివరించడం జరుగుతుందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు కుమార్ రాజా, పుష్ప, రాంజీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌కు ఎస్పీ అభినందన



కరప పీసీకి ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ

కరప, జూన్ 3: ఎన్నికల విధుల్లో విశేష సేవలందించిన కరప కానిస్టేబుల్ జీకే సురేష్‌కుమార్‌ను జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అభి నందించారు. ఎన్నికల విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన పోలీస్ సిబ్బందిని గుర్తించి వారి సేవలకు గుర్తింపుగా ప్రశంసాపత్రాలు, నగదు రివార్డులను అందజేశారు. దీనిలో భాగంగా కరప పోలీస్‌స్టేషన్ నుంచి పీసీ సురేష్‌కుమార్‌ను ఎస్పీ ప్రశంసాపత్రం, నగదు రివార్డుతో సత్కరించారు. కరప ఎస్ఐ తుపాటి రామకృష్ణ, ఏఎస్ఐ వి.సూరిబాబు, సహచర సిబ్బంది ఆయన్ని అభినందించారు.

రౌతులపూడి: రౌతులపూడి పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ అప్పికొండ నూకరాజును జిల్లా ఎస్పీ అభినందించారు. ఎన్నికల్లో ఉత్తమ సేవలందించినందుకు ప్రశంసాపత్రం, నగదును ఎస్పీ కార్యాలయంలో అందించారు.

ప్రధాన కూడళ్లల్లో పోలీసు కవాతు

పిఠాపురం, జూన్ 3: పిఠాపురం పట్టణంతో పాటు నియోజకవర్గంలోని ప్రధాన కూడళ్లల్లో సోమవారం రాత్రి పోలీసు అధికారులు కవాతు నిర్వహించారు. ప్రత్యేక పోలీసు బలగాలతో కలిసి మాక్‌డ్రిల్ జరిపారు. ఎటువంటి పరిస్థితులను అయినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. పాదగయ సెంటర్ వద్ద జరిగిన కవాతులో ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు మురళీమోహన్, గుణశేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మిలటరీ బలగాల మోహరింపు

కొత్తపల్లి, జూన్ 3: మంగళవారం ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మిలటరీ బలగాలు మోహరిస్తున్నట్టు కొత్తపల్లి ఎస్ఐ పీవీ స్వామినాయుడు చెప్పారు. కొత్తపల్లి మండలంలో 6 మొబైల్ పార్టీలు పనిచేస్తున్నాయన్నారు. ప్రధాన కూడళ్లల్లో 4 పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. ఊరేంపులు, నిర్వహించడం బాణాసంచా కాల్చడం చేయకూడదని హెచ్చరించారు. పోలీసు హెచ్చరికలను ధిక్కరించి ఎవరైనా అతిగా ప్రవర్తిసే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

హైవేపై వాహనాల తనిఖీ

గొల్లప్రోలు, జూన్ 3: జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. 216వ జాతీయ రహదారిపై పిఠాపురం-గొల్లప్రోలు పట్టణాల మధ్య గల టోల్‌ప్లాజా వద్ద అని రకాల వాహనాలను ఆపి తనిఖీ చేశారు. సీఆర్‌పీసీ సెక్షన్ 144 కింద నిషేధాజ్ఞలు, పోలీసు యాక్టు 30 అమలులో ఉన్నాయని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని మైకులు ద్వారా ప్రచారం సాగించారు.

వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం

పిఠాపురం, జూన్ 3: పట్టణంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మాస కల్యాణోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, లగ్నాష్టక మహాసంకల్పం తదితర వేద మంత్రాలతో మాంగళ్యధారణ జరిపించారు. యాగ్నిక బ్రహ్మ సుదర్శనం మాధవ మణికంఠాచార్యులు, ఆలయ అర్చకుడు పి.విజయజనార్ధనాచార్యులు కల్యాణాన్ని జరిపించగా కార్యనిర్వహణాధికారి నున్న శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

పెద్దాపురం, జూన్ 3: మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ హుండీల ఆదాయాన్ని దేవదాయశాఖ అధికారుల సమక్షంలో సోమవారం లెక్కించారు. 37 రోజులకు రూ. 14,86,286 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో టీవీ సూర్యనారాయణ తెలిపారు. దేవదాయశాఖ అధికారులు వాడ్రేవు సురేష్‌కుమార్, కాట్నం జగన్మోహన శ్రీనివాస్ పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏజెంట్లకు అవగాహన

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 3: మంగళవారం జరిగే సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మంగళగిరిలో జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో కౌంటింగ్ ఏజెంట్లకు అవగాహన కల్పించారు. కాకినాడ జనసేన పార్లమెంటు అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తరఫున కౌంటింగ్ ఏజెంట్లు వెళ్లారు. కౌంటింగ్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, నియమ నిబంధనలపై నిపుణులు అవగాహన కల్పించారు.

బస్‌పాస్ కౌంటర్‌కు 2రోజులు సెలవు

ఏలేశ్వరం, జూన్ 3: బస్ పాస్ కౌంటర్ 2రోజుల పాటు పనిచేయదని ఏలేశ్వరం డిపో మేనేజర్ జివి.సత్యనారాయణ సోమవారం తెలిపారు. డిపోలో సాఫ్ట్‌వేర్ మార్పుల కారణంగా ఈనెల 6, 7న స్టూడెంట్స్, సీజనల్, దివ్యాంగులు, ఉద్యోగులు బస్‌పాస్‌ల కోసం రావద్దని, కౌంటర్ పనిచేయదని అందరూ గమనించాలని పేర్కొన్నారు. 8వ తేదీ నుంచి యథావిధిగా బస్‌పాస్ కౌంటర్ పనిచేస్తుందని, కొత్త బస్‌పాస్‌లు ఈనెల 12వ తేదీ నుంచి ఇస్తామని ఆయన తెలిపారు.

11న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

తుని రూరల్, జూన్ 3: హంసవరంలో గల ఏపీ మోడల్ స్కూల్లో 2024-25 విద్యాసంవత్సరానికి గాను 7,8,9 తరగతుల్లో ఖాళీలు భర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని ప్రిన్సిపాల్ పద్మజ తెలిపారు. సీట్ల భర్తీకి ఈ నెల 11న ప్రవేశపరీక్ష నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రౌతులపూడిలో అన్నదానం

రౌతులపూడి, జూన్ 3: రౌతులపూడిలో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకుని వ్యవ సాయ కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం నిర్వహించగా ప్రజలు ప్రసాదాలు స్వీకరించారు.

పేరులేనిచెట్టుకి విద్యుత్ సరఫరా

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

తాళ్లరేవు, జూన్ 3: పి.మల్లవరం పంచాయతీ పరిధి పేరులేనిచెట్టు ప్రాంతానికి విద్యుత్‌శాఖ ఏఈ ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం వచ్చిన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. తక్షణం మరమ్మతులు చేపట్టి పేరులేనిచెట్టు ప్రాంతానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో గ్రామస్తులు విద్యుత్‌శాఖ అధికారులు ధన్యవాదములు తెలియజేశారు.